# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :281 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: గురువారం 22-01-2026 | పేజీలు:4 వెల: 2.00


## హన్మకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ ఇంట్లో ఏసీబీ సోదాలు

హన్మకొండ అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి ఆదాయానికి మించిన ఆస్తులు కూడ బెట్టినట్లు వచ్చిన ఆరోపణల రావడంతో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు సోదాలు నిర్వహించారు. వెంకట్ రెడ్డి నివాసంతో పాటు ఆయనకు సంబం ధించిన ఇతర ప్రాంతాల్లో కూడా తనిఖీలు కొనసాగుతున్నాయి. తెలంగాణ వ్యాప్తంగా మొత్తం పది చోట్ల సోదాలు జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. హైదరాబాద్, నల్గొండ, మిర్యాలగూడ, హన్మకొండలోని ఇళ్లు, కార్యాలయాల్లో ఏసీబీ బృందాలు తనిఖీలు చేపట్టాయి. భారీగా నగదు, బంగారం, ఆస్తి పత్రాలు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. పదవిని అడ్డం పెట్టుకొని వందల కోట్ల విలువైన ఆస్తులు సంపాదించినట్లు ఆరోపణలు ఉండటంతో మొదటి ఏసిబి అధికారులు ప్రాథమిక విచారణ జరిపి... అనంతరం అధికారి కలెక్టర్ ఆదాయానికి మించిన ఆస్తులు సంపాదించినట్లుగా గుర్తించి కేసు నమోదు చేసుకుని ఈ సోదాలు కొనసాగిస్తున్నారు. సోదాల సందర్భంగా కీలక పత్రాలు, ఆర్థిక లావాదేవీల వివరాలను ఏసీబీ అధికారులు పరిశీలిస్తున్నారు. పూర్తి స్థాయి దర్యాప్తు అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

## తెలంగాణకు గుడ్‌న్యూస్.. రూ.6 వేల కోట్ల విద్యుత్ ప్రాజెక్ట్..



దావోస్:క్లీన్ ఎనర్జీ రంగంలో తెలంగాణ రాష్ట్రం మరో కీలక అడుగు వేసింది. భవిష్యత్ విద్యుత్ అవసరాలను పర్యావరణానికి హాని కలగకుండా తీర్చే దిశగా, స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ ఆధారిత అణు విద్యుత్ ప్రాజెక్ట్ అభివృద్ధికి విదేశీ సంస్థ ఆసక్తి చూపించింది. స్లోవాకియాకు చెందిన న్యూక్లర్ ప్రొడక్ట్స్ సంస్థ, సుమారు రూ. 6 వేల కోట్ల పెట్టుబడితో ఈ ప్రాజెక్ట్‌ను తెలంగాణలో ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తోంది. ఈ ప్రతిపాదనకు సంబంధించి ఆ సంస్థ ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వానికి ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (EOI) సమర్పించింది. దావోస్‌లో నిర్వహించిన ప్రపంచ ఆర్థిక వేదిక-2026 సమావేశాల సందర్భంగా, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో న్యూక్లర్ ప్రొడక్ట్స్ సంస్థ ప్రతినిధులు భేటీ అయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో క్లీన్, గ్రీన్ ఎనర్జీ పెట్టుబడులపై విస్తృతంగా చర్చ జరిగినట్లు సమాచారం. ఈ భేటీలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఐక్యూ క్యాపిటల్ గ్రూప్ ఛైర్మన్ డా. జాన్ బాబిక్, గ్రూప్ సీఈఓ అనిల్ కుమార్ బావిసెట్టి, గ్రీన్ హౌస్ ఎన్విరో సీఈఓ మొలుగు శ్రీపాల్ రెడ్డి, స్లోవాక్ రిపబ్లిక్ కాన్సుల్ మాటుస్ జెమెస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం సుస్థిర అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని స్పష్టం చేశారు. క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను ప్రోత్సహించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. 2047 నాటికి దేశం నిర్దేశించుకున్న నెట్-జీరో లక్ష్య సాధనలో తెలంగాణ కీలక పాత్ర పోషించాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. న్యూక్లర్ ప్రొడక్ట్స్ సంస్థ స్లోవాకియాకు చెందిన ఐక్యూ క్యాపిటల్ గ్రూప్, భారత్‌కు చెందిన గ్రీన్ హౌస్ ఎన్విరో సంస్థల సంయుక్త భాగస్వామ్యంతో ఏర్పడిన సంస్థగా తెలుస్తోంది. ఈ సంస్థ గరిష్ఠంగా 300 మెగావాట్ల సామర్థ్యం కలిగిన స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ ఆధారిత విద్యుత్ కేంద్రాన్ని తెలంగాణలో ఏర్పాటు చేసే సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తోంది. ఈ ప్రాజెక్ట్ మొత్తం పెట్టుబడి విలువ సుమారు 600 మిలియన్ యూరోలు, అంటే భారత కరెన్సీలో దాదాపు రూ. 6,000 కోట్లుగా అంచనా వేస్తున్నారు. ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చితే, రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెరగడమే కాకుండా, పర్యావరణ హితమైన శక్తి వనరుల వినియోగంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై దాడి చేయడమే ప్రజాపాలనా?..

హైదరాబాద్,అలంపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడిపై కాంగ్రెస్ సీనియర్ నేత, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి దాడిని మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. విజయుడిపై కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి దుర్భాషలాడుతూ చేయి చేసుకోవడం దారుణం, అప్రజాస్వామికమని విమర్శించారు. ప్రజల చేత ఎన్నిక కాబడిన ప్రతినిధిపై దాడి అంటే ప్రజల తీర్పుపైనే దాడి అని స్పష్టం చేశారు. విజయుడిపై ఎంపీ మల్లు రవి దాడిని బీఆరచవతీతీచస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. మల్లు రవి తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేను బెదిరించడం, దాడి చేయడమేనా ప్రజాపాలన అని ప్రశ్నించారు. దాడికి పాల్పడిన మల్లు రవిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



అసలేం జరిగిందంటే..

మంగళవారం జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం పైపాడ్ గ్రామంలో సీసీరోడ్ల నిర్మాణానికి ఎంపీ మల్లు రవి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌తో పాటు బీఆర్ఎస్ అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు హాజరయ్యారు. భూమిపూజ కార్యక్రమంలో మొదట ఎంపీ కొబ్బరికాయలు కొట్టగా తర్వాత ఎమ్మెల్యే పనులు ప్రారంభించే ప్రయత్నం చేశారు. అదే సమయంలో అలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్? కొబ్బరికాయ కొట్టేందుకు ముందుకురావడంతో ప్రొటోకాల్ లేని వ్యక్తులతో ఎలా కొట్టిస్తారని ఎంపీని, ఎమ్మెల్యే ప్రశ్నించారు. దీంతో రెచ్చిపోయిన మల్లు రవి 'ఎవడ్రా నువ్వు' అంటూ ఆగ్రహంతో ఊగిపోయారు. ఎమ్మెల్యే విజయుడును తోసేయడంతో పాటు అక్కడున్న వారితోనూ ఓ వీధి రౌడీలా ప్రవర్తించారు. దీంతో పోలీసులు ఎంపీని అదుపు చేశారు. సీనియర్? ఎంపీ రవి ఎమ్మెల్యేతో అమర్యాదగా మాట్లాడటాన్ని నియోజకవర్గ ప్రజలు తప్పుపడుతున్నారు. ఎంపీగా గెలిచినప్పటి నుంచి నడిగడ్డలో గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తూ అలజడి రేపుతున్నారని బీఆర్?ఎస్? నాయకులు ఆరోపిస్తున్నారు. గతంలోనూ ఇదే ఎంపీ గద్వాల నియోజకవర్గ ప్రజాప్రతినిధితో అమర్యాదగా మాట్లాడి, ఒకరిపై ఒకరు చేయి చేసుకోవడం సోషల్? మీడియాలో వైరల్? అయ్యింది

## సింగరేణిపై బీఆర్ఎస్ విష ప్రచారం..



హైదరాబాద్, సింగరేణి కాలరీస్ సంస్థ విషయంలో బీఆర్?ఎస్ నేతలు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా మండిపడ్డారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికే విపక్షం నిరాధారమైన ఆరోపణలు చేస్తోందని ధ్వజమెత్తారు. అధిక ధరలకే టెండర్లు: బీఆర్?ఎస్ అధికారంలో ఉన్న సమయంలో సింగరేణిలో భారీగా అక్రమాలు జరిగాయని పొన్నం ఆరోపించారు. గత ప్రభుత్వం ఏకంగా 30 శాతం అధిక కేటాయింపులతో కాంట్రాక్టులు మరియు టెండర్లను అప్పగించిందని ఆయన విమర్శించారు. అప్పట్లో కాంట్రాక్టులు పొందిన సంస్థలు ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో చెడ్డవి ఎలా అవుతాయని ఆయన ప్రశ్నించారు. పార్టీలోనే సమన్వయ లోపం: బీఆర్?ఎస్ హయాంలో జరిగిన అవినీతి గురించి ఆ పార్టీ నేత కవిత స్వయంగా మాట్లాడారని, కానీ ఆమె లేవనెత్తిన ప్రశ్నలకు ఇప్పటివరకు ఆ పార్టీ నేతలు సరైన సమాధానం ఇవ్వలేకపోయారని మంత్రి ఎద్దేవా చేశారు. అసెంబ్లీ నుంచి పారిపోయారు: గతంలో హిల్ట్ పాలసీలపై ఇలాగే ఆరోపణలు చేశారని, కానీ వాటిపై అసెంబ్లీలో చర్చకు సిద్ధమవ్వగా సమాధానం చెప్పలేక బీఆర్?ఎస్ నేతలు సభను బహిష్కరించి వెళ్లిపోయారని పొన్నం ప్రభాకర్ గుర్తుచేశారు. గొంతు చించుకుని అరిచినంత మాత్రాన అబద్ధాలు నిజం కావని, ప్రతిపక్షం తన వైఖరి మార్చుకోవాలని ఆయన హితవు పలికారు.

## మద్యం కేసులో ఆ ముగ్గురి అరెస్ట్, బెయిల్ పై సుప్రీం కీలక ఆదేశాలు..!!



న్యూఢిల్లీ,మద్యం కేసులో ముగ్గురు నిందితుల బెయిల్ పిటీషన్ పై సుప్రీంలో విచారణ జరిగింది. సుప్రీం కీలక సూచనలు చేసింది. నిందితులు దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ, రెగ్యులర్ బెయిల్ కోసం ట్రయల్ కోర్టును ఆశ్రయించాలని స్పష్టం చేసింది. అదే సమయంలో అరెస్ట్ నుంచి మధ్యంతర రక్షణ మరో నెల రోజుల పాటు కొనసాగిస్తూ రిలీఫ్ ఇచ్చింది. గతంలో వీరి విషయంలో హై కోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. ఏపీ లిక్కర్ కేసులో డిఫాల్ట్ బెయిల్ పైన కృష్ణమోహన్ రెడ్డి, ధనుంజయ రెడ్డి, బాలాజీ గోవిందప్ప బయటకు వచ్చారు. అయితే, ట్రయల్ కోర్టు మంజూరు చేసిన డీఫాల్ట్ బెయిల్?ను రద్దుచేస్తూ.. హైకోర్టు గతంలో తీర్పు ఇచ్చింది. దీని పైన ఈ ముగ్గురూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కాగా, ఈ కేసు నేడు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చింది. హైకోర్టు ఇచ్చిన తీర్పులో తాము జోక్యం చేసుకోలేమని ఈ మేరకు ధర్మాసనం స్పష్టం చేసింది. నిందితులు తమకు బెయిల్ కావాలంటే సంబంధిత ట్రయల్ కోర్టులోనే రెగ్యులర్ బెయిల్ పిటిషన్ వేసుకోవాలని ఆదేశించింది. కాగా.. ఈ కేసులో నిందితులకు తక్షణమే అరెస్ట్ ముప్పు లేకుండా కొంత ఉపశమనం కలిగిస్తూ సుప్రీం కోర్టు స్పష్టత ఇచ్చింది. గతంలో (నవంబర్ 26న) సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర రక్షణ ఉత్తర్వులు ప్రస్తుతం కొనసాగుతాయని తెలిపింది. అదే సమయంలో ఒకవేళ ట్రయల్ కోర్టులో బెయిల్ రాకపోతే.. తిరిగి హైకోర్టును ఆశ్రయించేందుకు వీలుగా నిందితులకు నాలుగు వారాల పాటు మధ్యంతర రక్షణ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీని ద్వారా ఈ ముగ్గురికి నెల రోజుల పాటు వారికి అరెస్ట్ నుంచి రక్షణ కొనసాగనుంది.

## మల్లు రవి తక్షణమే క్షమాపణ చెప్పాలి.. ఎమ్మెల్యే విజయుడిపై దాడిని ఖండించిన కేటీఆర్





హైదరాబాద్,అలంపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడిపై కాంగ్రెస్ సీనియర్? నేత, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి దాడిని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ఇది ప్రజాస్వామ్యంపై జరిగిన బహిరంగ దాడి అని పేర్కొన్నారు. ప్రతిపక్షాన్ని భయపెట్టేందుకు, గొంతు నొక్కేందుకు కాంగ్రెస్ నేతలు దిగజారిన రాజకీయానికి ఇది నిదర్శనమని తెలిపారు. ప్రజలతో ఎన్నికైన ఎమ్మెల్యేను అవమానిస్తూ, శారీరక దాడికి దిగడం కాంగ్రెస్ సంస్కృతి ఎంత దిగజారిందో అర్థమవుతుందని కేటీఆర్ మండిపడ్డారు. చట్టం, రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలపై కాంగ్రెస్?కు గౌరవం లేదని ఈ ఘటన మరోమారు స్పష్టం చేస్తోందన్నారు. ఈ దాడిని బీఆరచవతీతీచస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ఎంపీ మల్లు రవి తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నైతిక బాధ్యత వహించి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిపక్షాన్ని బెదిరింపులతో కాదు, ప్రజల తీర్పుతోనే ఎదుర్కోవాలని సూచించారు. బీఆర్?ఎస్ నాయకులపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో గట్టిగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. మంగళవారం జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం పైపాడ్? గ్రామంలో సీసీరోడ్ల నిర్మాణానికి ఎంపీ మల్లు రవి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌తో పాటు బీఆర్ఎస్ అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు హాజరయ్యారు. భూమిపూజ కార్యక్రమంలో మొదట ఎంపీ కొబ్బరికాయలు కొట్టగా తర్వాత ఎమ్మెల్యే పనులు ప్రారంభించే ప్రయత్నం చేశారు. అదే సమయంలో అలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొబ్బరికాయ కొట్టేందుకు ముందుకురావడంతో ప్రొటోకాల్ లేని వ్యక్తులతో ఎలా కొట్టిస్తారని ఎంపీని, ఎమ్మెల్యే ప్రశ్నించారు. దీంతో రెచ్చిపోయిన మల్లు రవి 'ఎవడ్రా నువ్వు' అంటూ ఆగ్రహంతో ఊగిపోయారు. ఎమ్మెల్యే విజయుడును తోసేయడంతో పాటు అక్కడున్న వారితోనూ ఓ వీధి రౌడీలా ప్రవర్తించారు. దీంతో పోలీసులు ఎంపీని అదుపు చేశారు. సీనియర్ ఎంపీ రవి ఎమ్మెల్యేతో అమర్యాదగా మాట్లాడటాన్ని నియోజకవర్గ ప్రజలు తప్పుపడుతున్నారు. ఎంపీగా గెలిచినప్పటి నుంచి నడిగడ్డలో గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తూ అలజడి రేపుతున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. గతంలోనూ ఇదే ఎంపీ గద్వాల నియోజకవర్గ ప్రజాప్రతినిధితో అమర్యాదగా మాట్లాడి, ఒకరిపై ఒకరు చేయి చేసుకోవడం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

అన్నదాతలారా.. దయచేసి ధైర్యం కోల్పోకండి: కేటీఆర్

తెలంగాణలో ఒకే రోజు ముగ్గురు అన్నదాతలు ఆత్మహత్య చేసుకోవడం అత్యంత ఆందోళనకరమని బీఆరచవతీతీచస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. సమైక్యరాష్ట్రంనాటి సంక్షోభ పరిస్థితులు తెలంగాణవ్యాప్తంగా నెలకొని ఉన్నాయనడానికి వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ఈ ఘటనలే నిదర్శనమని అన్నారు. ఆదిలాబాద్, మెదక్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ముగ్గురు రైతుల నిండు ప్రాణాలను పొట్టన పెట్టుకున్న పాపం ముమ్మాటికీ ఈ చేతకాని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదే అని మండిపడ్డారు. భూపాలపల్లిలో కోడెల సదానందం, మెదక్‌లో దేవ్ సోత్ సర్వేశ్, ఆదిలాబాద్ లో జాదవ్ అంకుష్ కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే 25 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ ముగ్గురు రైతుల ఆత్మహత్యలకు అప్పులే ప్రధాన కారణం కావడం, రేవంత్ సర్కారు మోసాలను, అబద్ధపు హామీల పేరిట చేసిన తీరని ద్రోహాన్ని అడుగడుగునా ఎత్తిచూపుతోందని అన్నారు. రుణమాఫీ పేరిట చేసిన నయవంచనకు తోడు, పెట్టుబడి సాయానికి పాతరేయడం, చివరికి యూరియాను కూడా ఎగ్గొట్టి దిగుబడిని దెబ్బతీయడంతో కాంగ్రెస్ పాలనలో తెలంగాణ అన్నదాత పరిస్థితి అనాథలా మారిందని అన్నారు. కేవలం రెండేళ్ల కాలంలోనే దాదాపు 900 మంది రైతులు గుండెపగిలి బలవన్మరణాలకు పాల్పడినా ఈ సన్నాసి సర్కారుకు ఇప్పటికీ సోయి రాలేదని కేటీఆర్ మండిపడ్డారు. పదేళ్లు ధైర్యంగా బతికిన రైతు కుటుంబాల్లో ఇవాళ మోగుతున్న ఈ మరణమృదంగానికి రేవంత్ సర్కారు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అన్నదాతలారా.. దయచేసి ధైర్యం కోల్పోకండి. మరో మూడేళ్లు ఓపిక పట్టండని సూచించారు. ఈ వ్యవసాయ వ్యతిరేక కాంగ్రెస్ పార్టీని, రైతు ద్రోహి రేవంత్‌ను గద్దెదించుదామని.. మన తెలంగాణలో వ్యవసాయరంగానికి మళ్లీ మంచిరోజులు తెచ్చుకుందామని అన్నారు.

## "వాళ్ళిద్దరూ ఒక్కటే.. కలిసే ఉన్నారు".. కవిత కీలక వ్యాఖ్యలు..



హైదరాబాద్,ట్యాంక్ బండ్ మీద ఇంకా కూడా తెలంగాణ వాళ్ళ విగ్రహాలు లేవని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తెలిపారు. ఆంధ్రా వాళ్ళ విగ్రహాలు తీసేయాలి అనడం లేదు కానీ తెలంగాణ వారి విగ్రహాలు పెట్టాలన్నారు. తాజాగా మీడియా సమావేశంలో మాట్లాడిన ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. మొన్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికలలో కూడా బీసీ రిజర్వేషన్లు మాట లేదని చెప్పారు. రిజర్వేషన్ల గురించి మాట్లాడకుండా దాట వేస్తున్నారని.. ఇప్పుడు గుంపు మేస్త్రి గుంట నక్కను విచారణకు పిలుస్తున్నారన్నారు. వాళ్ళిద్దరూ ఒక్కటే.. వాళ్ళు కలిసే ఉన్నారని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయమని యువత, మహిళలు పోటీ చేయాలని పిలుపునిచ్చారు. అవసరం ఉంటే తాను ప్రచారానికి వస్తానని హామీ ఇచ్చారు. నిన్న సికింద్రాబాద్ జిల్లా చేయమని కేటీఆర్ మాట్లాడిన మాటలను గుర్తు చేశారు. పది ఏళ్ళు ఎందుకు గుర్తు కు రాలేదని ప్రశ్నించారు. సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల టైం లోనే ఎందుకు విచారణకు పిలుస్తున్నారని నిలదీశారు. ఫోన్ టాపింగ్ విచారణ వల్ల నాలాంటి వాళ్లకు న్యాయం జరుగుతుందని తాను అనుకోవడం లేదన్నారు.

## తమిళనాడు రాజకీయాల్లో బిగ్ ట్విస్ట్.. ఎన్డీయే గూటికి టీటీవీ దినకరన్

చెన్నై:తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్ర రాజకీయాల్లో బిగ్ ట్విస్టులు చోటు చేసుకుంటున్నాయి. అధికారమే లక్ష్యంగా, డీఎంకే ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు తమిళనాడులో ఎన్డీయే కూటమి ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. గత కొంతకాలంగా ఎన్డీయేకు దూరంగా ఉంటూ, అన్నా డీఎంకే అధినేత ఎడప్పాడి కె. పళనిస్వామి పై తీవ్ర విమర్శలు చేస్తున్న ఏఎంఎంకే (AMMK) ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్.. కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎవరూ ఊహించని విధంగా ఆయన బుధవారం అధికారికంగా మళ్లీ ఎన్డీయే కూటమిలో చేరారు. చెన్నైలో మీడియాతో మాట్లాడిన ఆయన, రాష్ట్ర ప్రయోజనాలు, మంచి పాలన కోసం పాత విభేదాలను పక్కన పెట్టి ముందుకు సాగాలని నిర్ణయించుకున్నట్లు ప్రకటించారు. ఈ క్రమంలో ఆయన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్?తో భేటీ అయి తన మద్దతును తెలియజేశారు. అనంతరం ఎన్డీయే కూటమిలో చేరికపై దినకరన్ స్పందిస్తూ.. తమిళనాడు సంక్షేమం, పార్టీ ఉనికి కోసం కొన్ని సమయాల్లో రాజీపడటం బలహీనత కాదని, అది ఉమ్మడి ప్రయోజనాల కోసమేనని ఆయన స్పష్టం చేశారు. ఎడప్పాడి పళనిస్వామితో ఉన్న సమస్యలను "కూటమి భాగస్వాముల మధ్య ఉండే వివాదం"గా ఆయన అభివర్ణించడం గమనార్హం. దివంగత ముఖ్యమంత్రి జయలలిత (అమ్మ) ఆశయాలను అనుసరించే వారంతా ఒకే తాటిపైకి వచ్చి, రాష్ట్రంలో మళ్ళీ 'అమ్మ పాలన'ను పునరుద్ధరించడమే తమ అంతిమ లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే జనవరి 23న చెన్నైలో భారత ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొనే బహిరంగ సభకు దినకరన్ హాజరై తన బలాన్ని ప్రదర్శించనున్నట్లు తెలుస్తుంది.



## ఇజ్రాయెల్ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు భేటీ



దావోస్:ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు( ప్రపంచ ఆర్థిక సదస్సు కోసం దావోస్‌లో ఉన్న సందర్భంలో, రాజధాని అమరావతిని సైబర్ సెక్యూరిటీ హబ్?గా తీర్చిదిద్దేందుకు సాంకేతిక సహకారం కోసం ఇజ్రాయెల్ ప్రతినిధులను కలిశారు. ఈ సమావేశంలో ఇజ్రాయెల్ వాణిజ్య, పరిశ్రమల మంత్రి నిర్ బర్కత్, అలాగే ఆ దేశ ట్రేడ్ కమిషనర్ రోయ్ పిషర్ పాల్గొన్నారు. సమావేశంలో చంద్రబాబు ముఖ్యంగా విశాఖ-చెన్నై కారిడార్?లో యూఏవీ డ్రోన్ల తయారీ, వ్యర్థ జలాల రీసైక్లింగ్ సాంకేతికత, స్మార్ట్ సిటీ సాంకేతిక పరిష్కారాలు వంటి అంశాలపై ఇజ్రాయెల్ సాంకేతిక సహకారం అందించాలని అభ్యర్థించారు. చంద్రబాబు మాట్లాడుతూ, "అమరావతి, హైదరాబాద్ లాంటి నగరాలను సైబర్ సెక్యూరిటీ, హై-టెక్ పరిశ్రమల కేంద్రాలుగా మార్చడం ద్వారా యువతికి ఉద్యోగ అవకాశాలు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు పెరుగుదల వస్తుంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక పరిష్కారాలు, స్మార్ట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, డ్రోన్ టెక్నాలజీ, పరిశ్రమల డిజిటలైజేషన్ వంటి అంశాలపై అవగాహన పంచుకోవడం జరిగింది.

## శబరిమల ఆలయ బంగారు తాపడాల కేసు

తిరువనంతపురం, శబరిమల ఆలయ బంగారు తాపడాల కేసుపై విచారణ జరుపుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దూకుడు పెంచింది. ఇటీవల సుప్రీం కూడా ఈ ఏసుపై సీరియస్‌గా దృష్టి సారించింది. ఈ కేసు విచారణలో భాగంగా మంగళవారం మూడు రాష్ట్రాల్లోని 21 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేరళ, కర్ణాటక, తమిళనాడులలో ఈ సోదాలు జరుగుతున్నాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఉన్నికృష్ణన్ పొట్టి, ట్రావన్‌కోర్ దేవశ్వం బోర్డు మాజీ అధ్యక్షుడు పద్మకుమార్‌లకు సంబంధం ఉన్న ప్రాంతాల్లోను, వారి సన్నిహితులకు సంబంధించిన ఇళ్లల్లోనూ ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు ఈ కేసుపై కేరళ హైకోర్టు పర్యవేక్షణలో పనిచేస్తున్న రాష్ట్ర ప్రత్యేక దర్యాప్తు బృందం కూడా దర్యాప్తు చేస్తోంది. ఈ కేసులో మరింత క్షుణ్ణంగా దర్యాప్తు చేపట్టడానికి బంగారు తాపడాల పునరుద్ధరణ పనుల్లో భాగమైన ఇతర అధికారులను కూడా విచారిస్తున్నట్లు తెలిపారు. ఈ కేసులో ఇటీవల అరెస్టైన టీడీబీ మాజీ అధ్యక్షులు ఎ.పద్మకుమార్, మాజీ సభ్యుడు కె.పి.శంకరదాస్‌ల హయాంలోనే ఈ అక్రమాలకు బీజం పడిందన్నారు. శబరిమల ఆలయంలో ఆన్-సైట్ తనిఖీ చేయాలని కేరళ హైకోర్టు ఇటీవల సిట్ అధికారులను ఆదేశించింది. మరోవైపు ఈ కేసును కేంద్ర దర్యాప్తు సంస్థకు బదిలీ చేయాలని భక్తులు, పలువురు అధికారులు డిమాండ్ చేస్తున్నారు. ఈ కేసులో ఆలయ ప్రధాన పూజారి సహా ఇప్పటివరకు 12 మందిని పోలీసులు అరెస్టు చేశారు.

## విస్తరణకు మోక్షమెప్పుడు..

హైదరాబాద్, రహదారుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వాగ్దానాలకు, ఆచరణకు పొంతన కుదరడం లేదు. హైదరాబాద్-విజయవాడ(ఎన్‌హెచ్-65) రహదారి విస్తరణ పనులకు కేంద్రం ఇదివరకే సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినా ఇప్పటికీ ఒక్క అడుగూ ముందుకు పడలేదు. గడ్కరీతో తమకున్న పరిచయం ద్వారా త్వరలో విస్తరణ ప్రారంభిస్తామని ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి ప్రకటించినప్పటికీ క్షేత్రస్థాయిలో అమలుకావడం లేదు. ఎన్‌హెచ్-65ని రెండు దశాబ్దాల క్రితం నిర్మించారు. అప్పట్లో ఎన్‌హెచ్‌ఏఐకి, కాంట్రాక్ట్ సంస్థ జీఎంఆర్‌కు కుదిరిన ఒప్పందం ప్రకారం రహదారిని దశలవారీగా ఆరు లేన్లుగా విస్తరించాల్సి ఉన్నది. కానీ, 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావడంతో తమకు టోల్‌ట్యాక్స్ ఆదాయం తగ్గిపోయిందని పేర్కొంటూ జీఎంఆర్ సంస్థ ఆరు లేన్లకు విస్తరించకుండా పనులు నిలిపివేసి న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. టోల్‌ట్యాక్స్ మాత్రం యథావిధిగా వసూలు చేస్తున్నది. ఈ నేపథ్యంలో కేంద్రం ఇటీవల ఆ కాంట్రాక్టును రద్దు చేసి టోల్ వసూళ్లు ఎన్‌హెచ్‌ఏఐకి అప్పగించింది. అలాగే పెరిగిన ట్రాఫిక్‌కు అనుగుణంగా 229 కిలోమీటర్ల మేర ఆరు లేన్లుగా విస్తరించేందుకు ఆమోదం తెలిపింది. ఈ మేరకు డీపీఆర్ గతంలోనే ఎన్‌హెచ్‌ఏఐ వద్ద సిద్ధంగా ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం స్వల్ప మార్పులతో దాన్ని కేంద్రానికి పంపింది. చౌటుప్పల్, చిట్యాల్‌లలో జంక్షన్లను రీ డిజైన్ చేయగా ఎల్‌బీనగర్-హయత్‌నగర్ మధ్య సుమారు 5.5కి.మీ.ల మేర ఎనిమిది లేన్ల డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారు. డీపీఆర్‌కు కేంద్రం నుంచి ఆమోదం లభించాక టెండర్ల ప్రక్రియ మొదలయ్యే వీలున్నది. అయితే, మంత్రి కోమటిరెడ్డి వెంటనే కేంద్రం నుంచి అనుమతులు తెస్తామని, సాధ్యమైనంత తొందరలోనే పనులు ప్రారంభిస్తామని ప్రకటించారు. ఏడాది గడిచినా ఇప్పటికీ డీపీఆర్‌కు కూడా అనుమతులు లభించలేదు. ఫలితంగా పనులు మొదలయ్యేందుకు మరికొంత సమయం పట్టే అవకాశమున్నది.

భూసేకరణకు రైతులు ససేమిరా

రహదారి విస్తరణ కోసం భూసేకరణ చేయాల్సి ఉండగా రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. యాదాద్రి-భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో 9 గ్రామాలు, నల్లగొండలో చిట్యాల, నార్కట్‌పల్లి మండలాల్లో చెరి ఐదు గ్రామాలు, కట్టంగూర్ మండలంలోని నాలుగు గ్రామాలు, నకిరేకల్‌లో రెండు గ్రామాలు, కేతేపల్లిలో నాలుగు గ్రామాలు, సూర్యాపేట జిల్లాలోని సూర్యాపేట మండలంలో నాలుగు గ్రామాలు, చివ్వెంల మండలంలో ఆరు, కోదాడలో నాలుగు, మునగాలలో ఐదు గ్రామాల్లో భూసేకరణ చేయాల్సి ఉన్నదని గుర్తించారు. రైతులు ఒప్పుకోని కారణంగా భూసేకరణ ఇప్పట్లో సాధ్యంకాదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ రహదారిని అత్యాధునిక హై-సెక్యూరిటీ స్మార్ట్ హైవేగా నిర్మించేందుకు రూ.10,391.53 కోట్లు ఖర్చవుతుందని అంచనా.

ముందుకుసాగని బ్లాక్‌స్పాట్‌ల అభివృద్ధి

ఇదికాకుండా ప్రమాదాలు జరుగుతున్న 17 బ్లాక్‌స్పాట్‌లను గుర్తించిన ఎన్‌హెచ్‌ఏఐ రూ.325కోట్లతో రోడ్డు విస్తరణ, అండర్‌పాస్‌లు, సబ్‌వేలు, ఫ్లైఓవర్లు నిర్మించాలని నిర్ణయించింది. దాదాపు ఏడాది దాటుతున్నా ఇంకా పది శాతం కూడా పనులు మొదలుకాలేదు. దాదాపు 70శాతం పనులు మొదలు కావాల్సివుంది. ఈ పనులు ఎలాగూ ఇప్పట్లో అయ్యేలా లేకపోవడంతో వాహనదారులకు అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు ప్రభు త్వం రోడ్లపై గుంతల పూడ్చివేత, మరమ్మతు పనులు చేపట్టింది. మొత్తమ్మీద రోడ్డు విస్తరణ, బ్లాక్‌స్పాట్‌ల అభివృద్ధి పనులు ఎప్పటికి పూర్తవుతాయో రానున్న కాలమే నిర్ణయించాలి.

## మేయర్ సీటు కోసం కాంగ్రెస్‌లో పోటీ

మహబూబ్‌నగర్, మహబూబ్‌నగర్ మేయర్ స్థానం బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో ఈ పీఠాన్ని దక్కించుకునేందుకు అధికార పార్టీలోని ప్రధాన లీడర్లలో కొందరు తమ వారసులు, భార్యలను పోటీకి దింపేందుకు సిద్ధమవుతున్నారు. సీనియర్ లీడర్ ఎన్పీ వెంకటేశ్ తన రాజకీయ వారసురాలిగా కూతురు నేహశ్రీని బరిలోకి దింపే అవకాశాలున్నాయి. వీరు ఉండే 14వ డివిజన్ బీసీ జనరల్‌కు రిజర్వ్ కావడం కలిసొచ్చింది. అలాగే మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ సైతం తన భార్య ప్రసన్నను మేయర్‌గా పోటీకి దింపేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వీరు ఉండే 49వ డివిజన్ జనరల్‌కు రిజర్వ్ కాగా.. ఇక్కడి నుంచి ఆమెను కార్పొరేటర్‌గా పోటీకి దింపాలని భావిస్తున్నారు. మరో లీడర్ రాఘవేందర్ రాజు సైతం తన సతీమణి వసంతను మేయర్‌ను చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారు. వసంత ప్రస్తుతం మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలిగా పని చేస్తున్నారు. ఇదిలాఉంటే ప్రసన్న, వసంత ఇద్దరూ 49వ డివిజన్ పరిధిలోని వారే. దీంతో వీరిద్దరూ ఎక్కడి నుంచి పోటీ చేస్తారనే చర్చ జరుగుతోంది. కాగా, కాంగ్రెస్ లీడర్ బురుజు సుధాకర్ సతీమణి కల్పన కూడా పోటీకి సిద్ధమవుతున్నట్లు తెలిసింది. 52వ డివిజన్ నుంచి కార్పొరేటర్ గా పోటీ చేసి మేయర్ పీఠాన్ని దక్కించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

## జాతీయగీతాలపనకు నిరాకరణ

చెన్నై, తమిళనాడు శాసనసభ సమావేశంలో తన ప్రసంగాన్ని చదవకుండానే గవర్నర్ ఆర్.ఎన్.రవి నిష్క్రమించారు. ఈ ఏడాది శాసనసభ తొలి సమావేశం మంగళవారం ప్రారంభం కాగా తన ప్రసంగాన్ని చదవకుండానే ఆయన వాకౌట్ చేశారు. తమిళతల్లి ప్రార్థనా గీతం తర్వాత జాతీయగీతం ఆలపించాలని సభాపతిని గవర్నర్ కోరగా అందుకు నిరాకరించడంతో ఆయన వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. అన్ని శాసనసభల్లోనూ గవర్నర్ ప్రసంగానికి ముందు, తర్వాత జాతీయగీతాన్ని పాడతారని, ఇక్కడ ప్రసంగానికి ముందు ఆలపించాలని కోరినా

# ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతర మేడారం

అరణ్య సంస్కృతి, గిరిజన సంప్రదాయాలు, ధైర్యం, త్యాగాల గాథలు కలసి రూపుదిద్దుకున్న మహోత్సవమే మేడారం సమ్మక్క--సారలమ్మ జాతర. ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన ఈ ఉత్సవం, ప్రతి రెండేళ్లకోసారి లక్షలాది భక్తులను అటవీ గర్భంలోకి ఆహ్వానిస్తుంది. విగ్రహాలకన్నా ప్రకృతినే దేవతగా కొలిచే అరుదైన సంప్రదాయానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన ఈ జాతర, తెలంగాణ గిరిజనుల ఆత్మగౌరవం, చారిత్రక పోరాటాల ప్రతీకగా నేటికీ విశ్వవ్యాప్త గుర్తింపును పొందుతోంది.మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరను 'దక్షిణ భారత కుంభమేళా'గా పిలుస్తారు. ప్రతి రెండేళ్లకోసారి నిర్వహించే ఈ జాతరకు దేశం నలుమూలల నుంచీ దర్శించుకునేందుకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ అనంతరం 2014లో మేడారం జాతరను రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం 251 కోట్ల రూపాయల బడ్జెట్‌ను మంజూరు చేసింది. ఈ నెల 28 నుండి 31 వరకు నాలుగు రోజులపాటు సమ్మక్క-సారలమ్మ జాతర నిర్వహించనున్నారు.

చరిత్ర ప్రకారం..

సమ్మక్క-సారలమ్మలను వనదేవతలుగా పూజించడానికి గల కారణాలను పరిశీలిస్తే ఆసక్తికరమైన చరిత్ర కనిపిస్తుంది. పూర్వం కోయ దొరలు వేట కోసం అడవికి వెళ్లిన సందర్భంలో, పెద్దపులుల కాపలా మధ్య ఓ పసిపాప కనిపించిందట. ఆ శిశువును కోయలు తమ గుడారానికి తీసుకెళ్లి పెంచుకున్నారు. ఆ పాప వారి జీవితంలోకి వచ్చినప్పటి నుంచి కోయలకు శుభాలు కలగడంతో, ఆ పాప కొండదేవత అవతారమేనని వారు నమ్మారు. మాఘ శుద్ధ పౌర్ణమి రోజున ఆ పాపకు సమ్మక్క అని నామకరణం చేశారు. కాకతీయుల కాలంలో ప్రస్తుతం జగిత్యాల జిల్లా ప్రాంతంలోని పొలవాసను గిరిజన దొర మేడరాజు పాలించేవాడు. మేడరాజు సమ్మక్కను పెంచి పెద్దదిగా చేసి, తన మేనల్లుడు మేడారం పాలకుడైన పగిడిద్దరాజుతో వివాహం చేశాడు. సమ్మక్క-పగిడిద్దరాజు దంపతులకు సారలమ్మ, నాగులమ్మ, జంపన్న అనే ముగ్గురు సంతానం కలిగారు.

జాతర నేపథ్యం..

పగిడిద్దరాజు కాకతీయుల సామంతుడిగా ఉండేవాడు. కరవు కాటకాల కారణంగా ప్రజలు కొన్నేళ్లపాటు శిస్తు కట్టలేకపోయారు. శిస్తు చెల్లించకపోవడం, మేడరాజుకు ఆశ్రయం కల్పించడం, కోయ గిరిజనుల్లో తిరుగుబాటు భావాలు నూరిపోస్తున్నాడనే ఆరోపణలతో కాకతీయ సామ్రాజ్యాధినేత ప్రతాపరుద్రుడు పగిడిద్దరాజుపై యుద్ధానికి దిగాడు.. అయితే కాకతీయ సేనల దాడిని తట్టుకోలేక పగిడిద్దరాజు, సారలమ్మ, నాగులమ్మ, గోవిందరాజు యుద్ధంలో వీరమరణం పొందారు. ఈ వార్త విన్న జంపన్న అవమానాన్ని తట్టుకోలేక సంపెంగవాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటినుంచి ఆ వాగును జంపన్నవాగుగా పిలుస్తున్నారని చరిత్రకారులు చెబుతారు. తన కుటుంబ సభ్యుల మరణ వార్త విన్న సమ్మక్క యుద్ధరంగానికి వచ్చి కాకతీయ సేనలపై విరుచుకుపడింది. ఆమె వీరత్వాన్ని చూసి ప్రతాపరుద్రుడు ఆశ్చర్యానికి గురయ్యాడు. అయితే ఒక కాకతీయ సైనికుడు దొంగచాటుగా బల్లెంతో వెన్నుపోటు పొడవడంతో తీవ్రంగా గాయపడిన సమ్మక్క మేడారం గ్రామానికి ఈశాన్యంలో ఉన్న చిలకలగుట్టకు వెళ్లి అదృశ్యమైందని చెబుతారు. ఆ తర్వాత ఒక చెట్టుకింద పుట్ట దగ్గర కుంకుమ భరిణి కనిపించిందట. తప్పు గ్రహించిన ప్రతాపరుద్రుడు అనంతరం సమ్మక్క భక్తుడిగా మారి, కోయ రాజులు చెల్లించాల్సిన కప్పాన్ని రద్దు చేసి, రెండేళ్లకోసారి జాతర నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశాడు. అలా ఈ జాతర ప్రారంభమైందని కథనం.

జాతర ఎలా నిర్వహిస్తారంటే..?

జాతర మొదటి రోజు కన్నెపల్లి నుంచి సారలమ్మ గద్దెపైకి వస్తారు. అదే విధంగా కొండాయి నుండి గోవిందరాజును, పూనుగొండ్ల నుండి పగిడిద్దరాజును



మేడారానికి తీసుకువచ్చి గద్దెలపై ప్రతిష్ఠిస్తారు. రెండవ రోజు చిలకలగుట్ట నుండి సమ్మక్క కుంకుమ భరిణి రూపంలో గద్దెపైకి చేరుకుంటుంది. గిరిజన పూజారులు సంప్రదాయబద్ధంగా తల్లిని ఆహ్వానిస్తారు. మూడవ రోజు భక్తులు అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటారు. చివరి రోజు అమ్మవార్లు తిరిగి అడవిలోకి వెళ్లే 'వనప్రవేశం' కార్యక్రమం జరుగుతుంది. దీంతో జాతర ముగుస్తుంది. అయితే జాతరకు ముందే రోజుకు లక్షలాది మంది భక్తులు మేడారానికి చేరుకుంటుండటం విశేషం.

ప్రభుత్వ దన్నుతో మెరుస్తున్న మేడారం

ప్రపంచంలోనే ఆదివాసీలు, సంపద సృష్టికర్తలు, ఉత్పాదక శ్రామిక వర్గాలు అత్యధికంగా దర్శించుకునే మహా జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం అభివృద్ధి గత ప్రభుత్వాల కాలంలో అరకొరగానే కొనసాగింది. భారీ స్థాయిలో శాశ్వత అభివృద్ధి పనులను చేపట్టలేదు. ఇప్పుడు చరిత్ర తనకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నది. భవిష్యత్‌లో ఏ ఇతర మతాలు ఈ జన జాతరను హైజాక్ చేయకుండా, వారి చిహ్నాలు ఇక్కడ కనపడకుండా, ఆదివాసీ చరిత్రకు శాశ్వతత్వాన్ని సంతరింపచేసింది. 2026 జనవరి 28-31 తేదీల మధ్య మహా జాతర నిర్వహణకు మేడారంను సర్వ సన్నద్ధం చేసింది తెలంగాణ ప్రభుత్వం. మేడారం పరిసరాలన్నీ వృక్ష ఔషధ వైవిధ్య వనంగా మారుతున్నాయి.

మన మూలాలను గుర్తుచేసే జాతర..

సమ్మక్క-సారలమ్మల జీవితం ధైర్యం, త్యాగం, అన్యాయంపై పోరాటానికి ప్రతీకగా నిలుస్తుంది. కఠిన పరిస్థితుల్లోనూ ప్రజల హక్కుల కోసం నిలబడటం, ప్రకృతిని ఆరాధించడం, సమాజ శ్రేయస్సే లక్ష్యంగా పోరాడటం వారి జీవితాల ద్వారా తెలుస్తుంది. విగ్రహాలకన్నా ప్రకృతిలో భాగమైన పసుపు, కుంకుమ భరిణెల రూపంలో పూజలందుకోవడం మన మూలాలను గుర్తుచేస్తుంది. మేడారం జాతర భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక దృష్టితో ఒక ప్రధాన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందాలని ఆశిద్దాం.

### భార్యపై అనుమానంతో హత్య

హైదరాబాద్, మూడు ముళ్ల బంధంతో ఏడు అడుగులు వేసి తనతో వచ్చిన భార్యపై ఓ భర్త అనుమానం పెంచుకున్నాడు. ఆగ్రహంతో ఆమెపై రోకలి బండతో దాడి చేశాడు. దీంతో భార్య అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన హైదరాబాద్ బోరబండ అహ్మద్‌నగర్ డివిజన్‌లోని రాజీవ్ నగర్‌లో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. భార్య సరస్వతి(35)పై భర్త అనుమానం పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో దంపతుల మధ్య తరచూ ఘర్షణ జరిగేది. అలాగే మంగళవారం మరోసారి ఘర్షణ జరిగింది. దీంతో ఆగ్రహించిన భర్త.. భార్య తలపై రొకలి బండతో బలంగా కొట్టాడు. తలకు తీవ్ర గాయం కావడంతో.. ఆమె ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న బోరబండ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని.. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్న పోలీసులు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# చొరబాట్ల సమస్యకు బాధ్యులెవరు?



న్యూఢిల్లీ,ఎన్నికలు వచ్చాయంటే రాజకీయ పార్టీలు తాము విజయం సాధిస్తే ఏయే ప్రణాళికలు అమలు చేస్తామో హామీలిస్తూ ఓటర్లను ఆకట్టుకోవడానికి ప్రయత్నించడం సర్వసాధారణ విషయం. కానీ కొందరు ప్రజల మధ్య ద్వేషాన్ని రెచ్చగొట్టడానికి, ఆ విధంగా ఓట్లను కొల్లగొట్టడానికి తాపత్రయ పడుతుంటారు. ఏదో ఒక సాకుతో ప్రత్యర్థులపై ప్రజల్లో అపనమ్మకం కలిగించి కుట్రలు పన్నడం కొన్ని పార్టీల్లో ఇటీవల కొత్త వరవడి కనిపిస్తోంది. మతపరమైన అజెండాలను ముందుకు తీసుకెళ్తూ తమ పార్టీని బలోపేతం చేస్తూ అధికారం చేజిక్కించుకోవడానికి చేసే ప్రయత్నాలు కమలనాథులకు కొత్తేమీ కావు. ఇటువంటి వ్యూహాలను రూపొందించడంలో మొదటి నుంచీ వారు పరిపూర్ణత సాధిస్తూ విజయ పతాకాన్ని ఎగుర వేస్తున్నారు. కొన్ని నెలల్లో ఎన్నికలు జరగనున్న పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో ప్రధాని మోడీ మమ్మురంగా ప్రచారం సాగిస్తున్నారు.2047 నాటికి దేశం అభివృద్ధి సాధించాలంటే బెంగాల్ భవిష్య విజన్‌తోనే ముడిపడి ఉందని, బెంగాల్‌కు అసలైన సవాల్ చొరబాట్లేనని, వీటిని అరికట్టడంలో మమతా బెనర్జీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ప్రధాని మోడీ తీవ్రంగా విమర్శలు ఎక్కుపెట్టారు. చొరబాట్ల కారణంగానే మాల్దా, ముర్షిదాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో అల్లర్లు చెలరేగుతున్నాయని ధ్వజమెత్తారు. అంతేకాదు చొరబాట్ల ప్రభావంతో రాష్ట్రంలో అనేక చోట్ల జనాభా వర్గీకరణలో మార్పు వచ్చిందని తేల్చిచెప్పారు. మొత్తం మీద ఆ రాష్ట్రం బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వలస వచ్చిన వారికి స్వర్గధామంగా మారిందని చిత్రీకరిస్తున్నారు. ఈ వలసలకు అనేక కారణాలు, ముఖ్యంగా ఆర్థిక అవసరాలే అని అందరికీ తెలిసిందే. సరిహద్దుల్లోని వలసలను అరికట్టే బాధ్యత రాష్ట్రానిదా, కేంద్రానిదా అన్నది ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. దేశ సరిహద్దులను రక్షించే భారీ వ్యవస్థకు అత్యున్నత స్థానంలో ప్రధాన మంత్రి ఉంటారు.ఇందులో రాష్ట్ర నాయకత్వం పాత్ర చాలా స్వల్పం. అయినా చొరబాట్లను అరికట్టడం పూర్తి బాధ్యత పశ్చిమబెంగాల్ తృణమూల్ ప్రభుత్వానికే అన్నట్టు వాస్తవాలకు భిన్నంగా ప్రధాని మోడీ పదేపదే ఊదరగొడుతుండటం విచిత్రం. బంగ్లాదేశ్ సరిహద్దుతో ఉన్న మనదేశ సరిహద్దును రక్షించే బాధ్యత బిఎస్ఎఫ్ బలగాలదే. ఆ బలగాలకు ఆదేశాలు జారీ చేయాల్సింది కేంద్ర హోం మంత్రిత్వశాఖ. ప్రధాని మార్గదర్శకాలను అనుసరించి కేంద్ర హోం మంత్రిత్వశాఖ బిఎస్ఎఫ్ బలగాలపై అజమాయిషీ చేస్తుంది. ఇంత నెట్‌వర్క్ అల్లుకుని ఉన్నప్పుడు సరిహద్దుల్లో చొరబాట్ల నివారణలో వైఫల్యాలు ఎవరికి వర్తిస్తాయో వేరే చెప్పనక్కరలేదు. ప్రధాని మోడీ చొరబాట్ల గురించి చేస్తున్న వాదనలు, వ్యాఖ్యలు విశ్వసనీయత కలిగి ఉండాలంటే, ముందుగా చొరబాట్లను అడ్డుకుని, అక్రమ చొరబాటుదార్లను గుర్తించి, చట్టపరంగా శిక్షించడం, లేదా వారిని వెనక్కు పంపించడం ఇవన్నీ ప్రధాని యంత్రాంగమే చేయాల్సి ఉందన్న వ్యాఖ్యలు వస్తున్నాయి. అలా చర్యలు చేపడితే ఎవరూ అడ్డు చెప్పరు కూడా. అంతే తప్ప రాష్ట్ర ప్రభుత్వాన్ని నిందించడం వల్ల ప్రయోజనం ఏమిటి? కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ఈ అంశాన్ని ఎన్నికల ప్రచారంలో ఒక బూటకంగా మోడీ వర్గం వాడుకుంటున్నారని విపక్షాలు దుమ్మెత్తి పోస్తున్నాయి.ఈ సందర్భంగా మోడీ ఒక ప్రమాదకరమైన అంశాన్ని లేవనెత్తారు. బిజెపి అధికారంలోకి రాగానే పశ్చిమబెంగాల్‌లో చొరబాట్లను పాశ్చాత్య దేశాల మాదిరిగా తక్షణం అరికడతామని హామీ ఇచ్చారు. ప్రధానంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వలసవాదులపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకుంటున్నారో అటువంటి చర్యలు తీసుకుంటామన్న ఆలోచన కలిగించారు. అమెరికా విధానం ఇక్కడ కూడా అమలులోకి తెస్తే ప్రమాదకరమైన పరిణామంగా మారుతుంది. అమెరికాలో సరైన డాక్యుమెంట్లు లేని వలసవాదులను ఎన్ని విధాలా చిత్రహింసలు పెడుతున్నారో తెలిసిందే. అమెరికా లోని ఇమ్మిగ్రేషన్ అధికారులు, కస్టమ్స్ అధికారులు అక్రమవలస వాదులని ఎవరినైనా గుర్తిస్తే వారిలో కొందరు ప్రాణాంతక యాతన కూడా ఎదుర్కోవలసి వస్తోంది. అమెరికాలో స్థిరంగా ఉంటున్న అమెరికా ఇండియన్లు కూడా తమ చట్టబద్ధతను నిరూపించుకోలేక వివాదాస్పద పరిస్థితులతో సతమతమవుతుండడం ట్రంప్ డ్రైవ్ ఫలితమే. అమెరికా ప్రాతినిధ్యం వహిస్తున్నామని చెప్పుకునే ప్రతి విలువను ఇమ్మిగ్రేషన్ లేదా ఇతర నిఘా అధికారులు తిరస్కరించడం దీనిపై అమెరికాలో ఎంత దుమారం రేగుతోందో తెలిసిందే. అటువంటి ప్రభుత్వ దురహంకార పరిణామాలను భారత దేశం ఊహించడం లేదు.మరో ముఖ్య విషయం చొరబాట్ల వల్ల పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో జనాభా వర్గీకరణలో మార్పు వచ్చిందని, ప్రజల రూపురేఖల్లోను, అలవాట్ల లోను, మార్పు వచ్చిందని, భాషల్లో తేడాలు, స్వరాల్లో అపసవ్యాలు వచ్చాయని మోడీ ఆరోపిస్తున్నారు. ఇవన్నీ రెచ్చగొట్టే మాటల తప్ప మరేం కావు. పైగా యువతరం తమ వెనకే ఉన్నట్టు జెన్ జీ బిజెపి అభివృద్ధి నమూనాను విశ్వసిస్తున్నారని ప్రచారం చేస్తున్నారు. కొన్ని వర్గాల ప్రజలను అనుమానపు మబ్బుల్లో ఉంచడానికి ప్రయత్నించడం, ఒక సమాజానికి చెందిన పౌరులను, మరో సమాజానికి చెందిన పౌరులకు వ్యతిరేకంగా ప్రేరేపించడం ఎప్పటికీ, ఎవ్వరికీ ఆమోద యోగ్యం కాదు. వాస్తవాలను వక్రీకరించడం, చరిత్రను తారుమారు చేయడం ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేయడమే అవుతుంది. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అంటే అభివృద్ధి నమూనా అని చాటుకుంటున్నారు. అలా ప్రతి రాష్ట్రంలో తమ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉండాలన్నది బిజెపి ఆకాంక్ష.

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో పోటీచేస్తాం

విజయనగరం, ఏపీలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీని చిత్తుగా ఓడిస్తామని విజయనగరం ఎంపీ అప్పలనాయుడు స్పష్టం చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వార్డ్ మెంబర్ నుంచి కార్పొరేషన్ వరకు కూటమి అభ్యర్థులే విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్ రెడ్డి ఐదేళ్లలో చేయలేని అభివృద్ధిని ముఖ్యమంత్రి చంద్రబాబు 16 నెలల్లో చేసి చూపించారని అన్నారు. ఇరు తెలుగు రాష్ట్రాలు చంద్రబాబుకు రెండు కళ్లు అని ఎంపీ అన్నారు. తెలంగాణలోనూ తెలుగుదేశం పార్టీకి మంచి ఆదరణ ఉందని చెప్పారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో తెలుగుదేశం పోటీచేసే అంశంపై పార్టీ నిర్ణయం తీసుకుంటుందని అప్పలనాయుడు వెల్లడించారు. బీఆర్ఎస్, వైసీపీ కుమ్మక్కై సీఎం చంద్రబాబు మీద ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. నదీ జలాలపై బురద రాజకీయాలు చేస్తున్నారన్ని ÷ర్ అయ్యారు. జగన్ కోర్టుకు హాజరైతే బీఆర్ఎస్ వాళ్లు ఫ్లెక్సీలు పెట్టి స్వాగతం చెబుతున్నారని.. కేటీఆర్ ఖమ్మం వెళ్తే వైసీపీ నేతలు ఫ్లెక్సీలు పెడతారంటూ వ్యాఖ్యలు చేశారు. వైసీపీ, బీఆర్ఎస్.. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం సరికాదని ఎంపీ అన్నారు.మాజీ సీఎం జగన్ బెంగళూరులో కూర్చుని కుట్రలు చేస్తున్నారని విజయనగరం ఎంపీ ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు కూడా బెంగళూరు ప్యాలెస్ నుంచే కుట్రలో భాగమవుతున్నారని విమర్శించారు. జగన్ ఐదేళ్లు సీఎంగా ఉండి రాయలసీమకు ఒక్క పరిశ్రమ అయినా తెచ్చారా అని ప్రశ్నించారు. జగన్, బీఆర్ఎస్ నాయకులు సొంత వ్యాపారం కోసం కాకుండా అధికారంలో ఉన్నప్పుడు ఒక్కసారైనా ప్రజల సమస్యలపై చర్చించారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ రెండు పార్టీల నాయకులు టీడీపీపై అసూయపడుతున్నారని అప్పలనాయుడు అన్నారు.

## వీధి కుక్కలను చంపడం దారుణం

హైదరాబాద్, వీధి కుక్కలను చంపడంపై ప్రముఖ సినీనటి రేణూదేశాయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో వీధి కుక్కల దాడుల పేరుతో వాటిని హతమార్చడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. ఈ భూమిపై ప్రతి జీవికీ జీవించే హక్కు ఉందని స్పష్టం చేస్తూ, కుక్కలను చంపడం దారుణమని ఆమె వ్యాఖ్యానించారు. వీధి కుక్కలపై ద్వేషంతో మాట్లాడుతున్న కొందరిపై రేణూ దేశాయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కుక్కలను వ్యతిరేకిస్తున్నవారికి పిచ్చి పట్టిందంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కుక్కల దాడులపై వస్తున్న విమర్శలపై ఆమె ప్రశ్నల వర్షం కురిపించారు. '100 కుక్కల్లో ఐదు కుక్కలు కరిస్తే మిగతా అన్నింటినీ చంపేయాలా?' అంటూ ప్రశ్నించారు. సమస్యకు పరిష్కారం హింస కాదని, సరైన నిర్వహణ, వ్యాక్సినేషన్ అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. 'కేవలం కుక్కల వల్ల మృతి చెందినవారివే ప్రాణాలా?' అంటూ ప్రశ్నించారు. రోడ్డు ప్రమాదాల్లో, దోమల వల్ల వచ్చే వ్యాధులతో చనిపోయిన వారి ప్రాణాలకు విలువ లేదా? అని ప్రశ్నిస్తూ, సమస్యలను సమగ్రంగా చూడాలని సూచించారు. వీధి కుక్కల హత్యలను ఖండిస్తూ.. 'ఈ భూమిపై ప్రతి జీవికి జీవించే హక్కు ఉంది' అని స్పష్టం చేశారు. మనుషుల నిర్లక్ష్యం వల్లే చాలా సమస్యలు తలెత్తుతున్నాయని, జంతువులపై నింద వేయడం సరికాదని ఆమె పేర్కొన్నారు. కుక్కలను చంపడం దారుణమని, ఇది మానవత్వానికి మచ్చ అంటూ వ్యాఖ్యానించారు. చట్టపరంగా కూడా జంతువులను హతమార్చడం నేరమని గుర్తు చేశారు.ఈ అంశంపై మాట్లాడుతున్న సమయంలో మీడియా ప్రతినిధులతో జరిగిన వాగ్వాదంపై కూడా రేణూదేశాయ్ స్పందించారు. 'ఓ వ్యక్తి నన్ను ఉద్దేశించి మాట్లాడారని.. అందుకే ఆ వ్యక్తి గురించి మాట్లాడాల్సి వచ్చింది' అని స్పష్టం చేశారు. తాను ఎవరినీ అనవసరంగా అవమానించలేదని క్లారిటీ ఇచ్చారు. ఈ వివాదాన్ని రాజకీయ రంగుకు ముడిపెట్టడంపై రేణూదేశాయ్ అసహనం వ్యక్తం చేశారు. 'నాకు పాలిటిక్స్ ఇష్టం లేదని... నేను ఏ రాజకీయ పార్టీలోకి వెళ్లడం లేదు. నా వ్యాఖ్యలను రాజకీయ కోణంలో చూడొద్దు. అలానే నా వ్యక్తిగత జీవితాన్ని ఈ అంశానికి ముడిపెట్టకండి. నా పిల్లలను ఇందులోకి లాగొద్దు' అంటూ మీడియాకు రేణూదేశాయ్ విజ్ఞప్తి చేశారు.

## వేగంగా అడుగులు

హైదరాబాద్,వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి తెలంగాణ రాజకీయాల్లో బలమైన ముద్ర వేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత భావిస్తున్నారు. ఇప్పటికే ఆమె ఆ దిశగా కసరత్తు మొదలు పెట్టారు. బలమైన శక్తిగా తిరిగి వస్తానంటూ ఆమె మండలిలో భావోద్వేగ ప్రసంగం చేశారు. తెలంగాణ జాగృతినే పార్టీ మార్చి ముందుకు వెళ్లాలన్న సమాలోచనలు చేస్తున్నారు. సొంత పార్టీని స్థాపించడం ద్వారా ఎన్నికలకు వెళ్లాలని ఆమె నిర్ణయించినట్లు తెలుస్తోంది. అందుకోసం ఆమె వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. అందులో భాగంగా ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్‌తో కవిత వరుసగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. దాదాపు 60 రోజుల వ్యవధిలో రెండుసార్లు ప్రశాంత్ కిశోర్ హైదరాబాద్ వచ్చి.. కవితతో భేటీ అయినట్లు సమాచారం.సంక్రాంతి పండగ వేళ.. హైదరాబాద్‌లో కవిత, పీకేలు సమావేశమయ్యారని తెలుస్తోంది.ఈ సందర్భంగా తెలంగాణ ప్రజల కోసం పార్టీ ఏర్పాటు.. తమ పార్టీని ప్రజలు ఓన్ చేసుకోవడం.. ప్రజల కోణంలో ఎలా పనిచేయాలనే అంశంతో పాటు వివిధ అంశాలపై ప్రశాంత్ కిశోర్‌తో కవిత సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. ఇక పార్టీ విధానాల రూపకల్పన కోసం ఇప్పటికే 50 కమిటీలతో కవిత అధ్యయనం చేయిస్తున్న సంగతి తెలిసిందే. తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వ పరిరక్షణ కోసం పార్టీ ఏర్పాటు ప్రయత్నాల్లో కవిత వేగం పెంచిన విషయం విదితమే. ఇప్పటికే ప్రజల్లోకి వెళుతూ బిఆర్ఎస్‌ను దునుమాడుతున్నారు. తండ్రి కెసిఆర్ పాలనపై విమర్శలు గుప్పిస్తున్నారు. అలాగే కాంగ్రెస్ పైనా విమర్శలు చేస్తున్నారు.ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమంలో తెలంగాణ జాగృతి సంస్థ అధ్యక్షురాలు కవిత క్రియాశీలక పాత్ర పోషించారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైంది. అదే సమయంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో నాటి టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా కవిత గెలుపొందారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో అంటే.. 2019లో అదే స్థానం నుంచి మళ్లీ బరిలో దిగి.. బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ చేతిలో ఆమె ఓటమి పాలయ్యారు. టీఆర్ఎస్ తరఫున కవితను శాసనమండలికి ఆ పార్టీ అధినేత కేసీఆర్ పంపారు. ఆ తర్వాత చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు ఎమ్మెల్సీ పదవికి కవిత రాజీనామా చేశారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలిగా కవిత ప్రజల్లోకి వెళ్లారు. జనం బాట పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తూ.. ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలపై ప్రభుత్వాన్ని ఆమె నిలదీస్తున్న విషయం విదితమే. సొంత పార్టీ స్థాపించడం ద్వారా.. రానున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రముఖ రాజకీయ పార్టీలకు బలమైన పోటీగా నిలవాలని కవిత భావిస్తున్నారు. అందుకోసం ఆ దిశగా అడుగులు వేస్తున్నారామె. ఈ నేపథ్యంలో ఇలా ప్రశాంత్ కిశోర్‌తో వరుస భేటీలు నిర్వహిస్తున్నారు.గతంలో 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ తెలంగాణలో ముచ్చటగా మూడోసారి అధికారం చేపట్టాలని బీఆర్ఎస్ అధినేత

# పాలమూరు జిల్లాలో వేడెక్కిన మున్సిపల్ పోరు



మహబూబ్‌నగర్,ఉమ్మడి పాలమూరు జిల్లాపై ఇప్పుడు అందరి దృష్టి పడింది. సిఎం సొంత జిల్లా కావడంతో పాటు, ఇప్పుడు ఇక్కడ అనేక అభివృద్ధి కార్యక్రమాలకు రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. తమ జిల్లాలో ఏదో ఒక పనిమీద పరుగులు పెడుతున్నారు. దీంతో ఈ ఉమ్మడి జిల్లా మున్సిపాలిటీలపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఏడు మున్సిపాలిటీలు ఉండగా.. జడ్చర్ల పాలకవర్గం పదవీ కాలం ఇంకా పూర్తి కాలేదు. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లోని భూత్పూర్, దేవరకద్ర, కోస్గి, మద్దూరు, మక్తల్, నారాయణపేట మున్సిపాలిటీలు, మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌కు ఎన్నికలు జరగనున్నాయి. ఈక్రమంలో కాంగ్రెస్ హైకమాండ్ గెలుపు బాధ్యతలను జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు అప్పగించింది. మంత్రి దామోదరకు మహబూబ్‌నగర్ పార్లమెంట్ బాధ్యతలను అప్పగించింది. ముందుగా ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ పరిధిలోని లీడర్లతో సమావేశం కానున్నారు. వార్డులు, డివిజన్లలో పార్టీ పరిస్థితి, ప్రతిపక్షాల బలాలు, బలహీనతలపై చర్చించనున్నారు. పార్టీ నుంచి పోటీకి ఎవరు ఆసక్తి చూపుతున్నారు. ఏయే స్థానాల్లో లీడర్ల మధ్య పోటీ ఎక్కువగా ఉంది. అక్కడ ఎవరిని బరిలోకి దింపితే గెలిచే అవకాశం ఉంది. ఎవరిని నిలిపితే..ఎవరిని తప్పించాలి.. రెబల్స్ ఉంటే వారిని బుజ్జగించి.. ఇతర అవకాశాలు కల్పించేలా హైకమాండ్ నుంచి హామీలు ఇప్పించే ప్రయత్నాలు చేయనున్నారు. దీనికితోడు వార్డులు, డివిజన్ల వారీగా ఎప్పటికప్పుడు ప్రజానాడిని, అక్కడి పరిస్థితులను లీడర్లతో సమీక్షించనున్నారు. అసరమైతే రెండు, మూడు డివిజన్లకు ఒక లీడర్‌ను ఇన్ చార్జీగా నియమించే అవకాశాలు ఉన్నాయి. వార్డులు, డివిజన్లలో పర్యటిస్తూ పార్టీ క్యాండిడేట్లను గెలిపించే బాధ్యతను తీసుకోనున్నారు. ఇప్పటికే పోటీ చేయాలనుకున్న అభ్యర్థులు పలుచోట్ల సంక్రాంతి సందర్భంగా క్రికెట్ పోటీలు నిర్వహించి, ఖర్చులను వార్డు లీడర్లు భరించారు. నడిగడ్డలో ఈసారి త్రిముఖ పోటీ నెలకొంది. ఇప్పటికే కాంగ్రెస్ సమావేశాలు నిర్వహించి మున్సిపల్ ఎన్నికలకు క్యాడర్ ను సిద్ధం చేసింది. బీజేపీ నాయకులు కూడా ప్రతిరోజు మీటింగ్ లు పెట్టుకుంటూ కార్యకర్తల్లో జోష్ నింపే ప్రయత్నం చేస్తున్నారు. బీఆర్ఎస్ కు చెందిన మాజీ మంత్రులు ఇప్పటికే రెండుసార్లు సమావేశాలు నిర్వహించారు. జోగులాంబ గద్వాల జిల్లాలో గద్వాల, అలంపూర్, అయిజ, వడ్డేపల్లి మున్సిపాలిటీల్లో ఎన్నికలు జరగనున్నాయి. గద్వాలలో 37 వార్డులు, అయిజలో 20 వార్డులు, అలంపూర్ లో 10, వడ్డేపల్లిలో 10 వార్డులు ఉన్నాయి. వార్డుల వారీగా రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఎన్నికల వేడి మొదలు అయింది. ఇప్పటికే కొన్ని చోట్ల వివిధ పార్టీల నుంచి పోటీలో ఉండే అభ్యర్థులు వార్డులో ప్రభావం చూపే ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు ప్లాన్ చేస్తున్నారు. కుల సంఘాలు, యూత్ లీడర్లను కలిసి తమకు మద్దతు తెలియజేయాలని కోరుతున్నారు. గెలుపే లక్ష్యంగా పోటాపోటీగా ప్రచారం చేయడంతో పాటు నజరానాలు పంపిణీ చేసేందుకు సిద్ధం అవుతున్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో త్రిముఖ పోటీ నెలకొంది. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య పోటీ తీవ్రంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. గద్వాల మున్సిపాలిటీలో మూడు పార్టీలు బలంగా ఉండడంతో ఎక్కువ స్థానాలు గెలుపొంది చైర్మన్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు అందరూ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. అలంపూర్ నియోజకవర్గంలోని అయిజ, అలంపూర్, వడ్డేపల్లి మున్సిపాలిటీల్లో కూడా పోరు రసవత్తరంగా మారనుంది. వార్డుల్లో పోటీ చేసేందుకు ప్రతి వార్డుకు ముగ్గురిని ఎంపిక చేసి వారి పేర్లను హైకమాండ్‌కు పంపించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. లోకల్‌గా ఎలాంటి ఇబ్బంది లేకుండా హైకమాండ్ ఎంపిక చేసేలా చూస్తున్నారు. వార్డుల్లో గెలిచే అభ్యర్థులకే పార్టీ టికెట్ ఇచ్చేలా వ్యూహాత్మకంగా పార్టీలు వ్యవహరిస్తున్నాయి. వార్డుల్లో ఏ వర్గానికి చెందిన ఓట్లు ఎక్కువగా ఉన్నాయనే విషయంతో పాటు ఆర్థికంగా బలంగా ఉన్న అభ్యర్థులను నిలబెట్టేందుకు మూడు పార్టీలు తమవంత ప్రయత్నం చేస్తున్నాయి.

# అమెరికాపై ట్రేడ్ బజూకా అస్త్రం.. ట్రంప్ టారిఫ్‌లకు ఈయూ కౌంటర్!

న్యూఢిల్లీ, గ్రీన్‌లాండ్‌ని బలపరుస్తున్న యూరోపియన్ దేశాలపై కొత్త సుంకాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన దరిమిలా 27 సభ్యదేశాలతో కూడిన యూరోపియన్ యూనియన్ (ఈయూ) మొట్టమొదటిసారి అమెరికాపై శక్తివంతమైన వాణిజ్య ప్రతీకార ఆయుధాన్ని ప్రయోగించడానికి సిద్ధపడింది. ఈ పరిణామంతో అమెరికా, యూరపు మధ్య సంబంధాల్లో ఉద్రిక్తతలు తలెత్తాయి. గ్రీన్‌లాండ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునేందుకు ట్రంప్ చేస్తున్న హెచ్చరికల నేపథ్యంలో వాణిజ్య బజూకాను ప్రయోగించాలని ఈయూ మొట్టమొదటిసారి నిర్ణయించుకుంది. గ్రీన్‌లాండ్‌కి మద్దతు ఇస్తున్న ఈయూ సభ్య దేశాలైన డెన్మార్క్, ఫిన్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ, నెదర్లాండ్స్, నార్వే, స్వీడన్, బ్రిటన్‌పై ఫిబ్రవరి 1 నుంచి 10 శాతం సుంకాలు విధిస్తున్నట్లు శనివారం ట్రంప్ ప్రకటించారు.అమెరికా భద్రతకు డానిష్ భూభాగమైన గ్రీన్‌లాండ్ అత్యంత కీలకమని వాదిస్తున్న ట్రంప్ గ్రీన్‌లాండ్‌పై ఒప్పందానికి రాకపోతే జూన్ 1 నుంచి సుంకాలను 25 శాతానికి పెంచుతానని కూడా హెచ్చరించారు. ఈ యూరోపియన్ దేశాలు గ్రీన్‌లాండ్‌కు మద్దతు ప్రకటించిన వెంటనే ట్రంప్ నుంచి ఈ రకమైన హెచ్చరికలు వెలువడడంతో అమెరికా, యూరోపియన్ దేశాల మధ్య వివాదం కొత్త మలుపు తీసుకుంది. దౌత్య సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపిన ట్రంప్ హెచ్చరికలపై వేగంగా స్పందించిన యూరోపియన్ దేశాల ప్రతినిధులు ఆదివారం బ్రస్సెల్స్‌లో సమావేశమయ్యారు. అమెరికా-ఈయూ సంబంధాల భవిష్యత్ పరిణామాలను, తక్షణం తీసుకోవలసిన చర్యలను ఈ సమావేశంలో చర్చించారు. అత్యవసర సమావేశం అనంతరం ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మానుయెల్ మాక్రాన్ విలేకరులతో మాట్లాడుతూ మొట్టమొదటిసారి అమెరికాపై ఈయూ తన ట్రేడ్ బజూకాను ప్రయోగించవలసిన సమయం ఆసన్నమైందని ప్రకటించారు.

ట్రేడ్ బజూకా అంటే..

ట్రేడ్ బజూకా అనేది బలప్రయోగాన్ని ఎదుర్కొనే సాధనాన్ని(ఏసీఐ) సూచిస్తుంది. బయటి దేశాల నుంచి ఎదురయ్యే ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొనేందుకు ఈయూ రూపొందించిన ఓ యంత్రాంగం ఇది. అమెరికాపై ఎదురు సుంకాలు విధించడానికి, లాభదాయకమైన ఈయూ కాంట్రాక్టులపై బిడ్డింగ్ వేయకుండా అమెరికన్ కంపెనీలను నిరోధించడానికి ఏసీఐ అనుమతిస్తుంది. తన ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలను కాపాడుకునే ఉద్దేశం ఈయూకు ఉందన్న స్పష్టమైన సందేశాన్ని అమెరికాకు పంపడమే లక్ష్యంగా ఈ చర్యలను ఈయూ చేపట్టనున్నది. ట్రేడ్ బజూకా సుంకాలకే పరిమితం కాదని, అదనపు ఆంక్షలు కూడా ఉంటాయని అధికారులు వెల్లడించారు. గతంలో అమెరికాపై ప్రకటించిన 9300 కోట్ల




యూరోల ప్రతీకార సుంకాలను విధించే అంశాన్ని కూడా ఈయూ పరిశీలిస్తుందని కూడా రాయిటర్స్ వార్తాసంస్థ వెల్లడించింది. ప్రస్తుత పరిస్థితిని ఊహించనిదిగా అభివర్ణించిన యూరోపియన్ దౌత్యవేత్తలు తాము ఈ నిర్ణయం తీసుకోవడానికి గతంలో అమెరికాతో ఉన్న వివాదాలు ప్రేరేపించలేదని స్పష్టం చేశారు. అమెరికా-ఈయూ చర్చలపైనే తదుపరి చర్యలు ఉండగలవని ఈయూ నాయకులు తెలిపారు. ఈయూ చర్యలు చాలా వేగంగా ఉంటాయని వారు స్పష్టం చేశారు.

గ్రీన్‌లాండ్‌కు సంఘీభావం: ఈయూ

ట్రంప్ సుంకాల హెచ్చరికలకు స్పందనగా గ్రీన్‌లాండ్‌కు సంఘీభావం ప్రకటిస్తూ 8 యూరోపియన్ దేశాలు ఆదివారం ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. డచ్ రాజ్యానికి, గ్రీన్‌లాండ్ ప్రజలకు తమ పూర్తి సంఘీభావంతో ఉన్నట్లు ప్రకటనలో స్పష్టం చేశాయి. నాటో సభ్యులుగా ఆర్కిటిక్‌లో భద్రతా ప్రయోజనాలు పంచుకుంటామని స్పష్టం చేస్తూ ఆర్కిటిక్ భద్రతను ఉమ్మడి అమెరికా-ఈయూ ప్రాధాన్యతగా బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నట్లు ప్రకటనలో పేర్కొన్నాయి. తాజా హెచ్చరికల నేపథ్యంలో అంతర్జాతీయ చట్టాలను రక్షించేందుకు కఠిన వైఖరిని ఈయూ తీసుకుంటుందని యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా ప్రకటించారు. ట్రంప్ విధించిన తాజా సుంకాలు ఈయూ-అమెరికా సంబంధాలను దెబ్బతీయగలవని యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా దెర్ లేయెన్ హెచ్చరించారు. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ అమెరికా అధ్యక్షుడి చర్యను విమర్శిస్తూ గ్రీన్‌లాండ్‌పై పట్టుకోసం నాటో మిత్రులపై సుంకాలు ప్రయోగించడం తప్పుడు నిర్ణయం అని, ఈయూ-అమెరికా మధ్య సంబంధాలను ఇది అస్థిరపరచగలదని హెచ్చరించారు.

# రిస్క్ సీటులో అంబటి ....రాజకీయ సంక్రాంతి కోసమేనా ?

అమరావతి,వైసీపీలో నోరున్న పేరున్న నేత మాజీ మంత్రి అంబటి రాంబాబు. ఆయన వాగ్దాటి ముందు ఎవరూ ఆగలేరు. ఆయన అలాంటి వాదనా పటిమని చూపిస్తారు. మీడియా ముందుకు వచ్చారంటే గుక్క తిప్పుకోకుండా అనర్గళంగా మాట్లాడుతారు. అంబటిలో చాలా ప్రత్యేకతలు ఉన్నాయి. ఆయన కాంగ్రెస్ వాదిగానే రాజకీయాల్లోకి వచ్చారు. వైఎస్సార్ ని ఆరాధించారు, ఆయన వారసుడు జగన్ తో కలసి ప్రయాణం చేస్తున్నారు. తన మొత్తం మూడున్నర దశాబ్దాల రాజకీయ జీవితంలో అంబటి గెలిచింది రెండే రెండు సార్లు. ఆయన మంత్రి కూడా 2022 నుంచి 2024 మధ్యలో అయిపోయారు. కీలకమైన జలవనరుల శాఖను కూడా నిర్వహించారు. ఇదిలా ఉంటే అంబటి సత్తెనపల్లి నుంచి మూడు సార్లు పోటీ చేస్తే ఒకసారి గెలిచారు. దాంతో జగన్ ఆయనను గుంటూరు పశ్చిమకు మార్చారు.

అక్కడ నుంచే పోటీ :

దాంతో ఆయన 2029 ఎన్నికల్లో అక్కడ నుంచే పోటీకి సిద్ధంగా ఉన్నానని సంకేతాలు ఇస్తున్నారు. అంబటి 2024లో సత్తెనపల్లిలో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు, 2025 లో మాత్రం ఎక్కడా నిర్వహించలేదు, కానీ ఈసారి గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో నిర్వహించారు. చాలా అట్టహాసంగా డ్యాన్సులు చేస్తూ మరీ సందడి చేశారు. ప్రత్యేకంగా రాయించుకున్న పార్టీ పాటలో ఆయన నర్తించిన తీరు ఆయన ఈ ఏజ్ లో వేసిన స్టెప్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. ఇక మీదట గుంటూరు పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గంలోనే తన సంక్రాంతి సంబరాలను ఏటేటా నిర్వహిస్తాను అని చెప్పడం ద్వారా అంబటి వచ్చే ఎన్నికల్లో పోటీకి తయారు అని చెప్పేశారు.

వైసీపీకి కలసి రాని వైనం :

ఇక అసెంబ్లీ నియోజకవర్గాల పునర్ విభజనలో గుంటూరు పశ్చిమ 2009లో ఏర్పాటు అయింది. తొలి సారి అక్కడ నుంచి కాంగ్రెస్ తరఫున కన్నా లక్ష్మీనారాయణ గెలిచారు. కానీ 2014 నుంచి మాత్రం వరసగా టీడీపీ గెలుస్తూ వస్తోంది. 2015లో మోదుగుల వేణు గోపాల రెడ్డి టీడీపీ నుంచి గెలిచారు. 2019లో టీడీపీ నుంచి మద్దాలి గిరిధర రావు గెలిచారు, 2024లో మళ్లీ టీడీపీ ముంచే గల్లా మాధవి గెలిచారు. విశేషం ఏంటి అంటే ఈ నియోజకవర్గం ఏర్పాటు అయ్యాక రెండు సార్లు కాపులు గెలిచారు. ఇక్కడ కాపుల సంఖ్య



అధికం. బహుశా ఆ ఉద్దేశ్యంతోనే వైసీపీ అధినాయకత్వం అదే సామాజిక వర్గానికి చెందిన అంబటి రాంబాబుని ఈ నియోజకవర్గానికి ఇంచార్జిగా చేశారు అని అంటున్నారు. తాజగా 2024 లో గెలిచిన మాధవి కూడా కాపు సామాజిక వర్గం వారు కావడం విశేషం.

వైసీపీ వేవ్ లో కూడా :

అయితే వైసీపీకి భారీ వేవ్ అన్నది 2019లో వచ్చింది. ఆ సమయంలో కూడా టీడీపీ ఇక్కడ నుంచి గెలిచింది అంటే అది టీడీపీకి కంచుకోట అని అర్థం అవుతోంది. అలాంటి చోట అంబటి రాంబాబుని పంపించారు అంటే రిస్క్ సీటులో ఫైట్ చేయమనే అర్థం అని అంటున్నారు. అయితే టీడీపీలో వర్గ పోరు ఉంది, ఎమ్మెల్యే మాధవికి మేయర్ కి మధ్య కోల్డ్ వార్ సాగుతోంది. అదే విధంగా నియోజకవర్గంలో పార్టీ కూడా అలాగే చీలిపోయింది. దాంతో పాటుగా అంబటి రాంబాబు నియోజకవర్గంలో మొదటి నుంచి ఉంటూ అందరినీ కలుపుకుని పోయే ప్రయత్నం చేస్తున్నారు. సామాజిక వర్గం ప్రభావం అంబటి రాజకీయ వ్యూహాలు పనిచేస్తే వైసీపీ ఇక్కడ నుంచి గెలుస్తుంది అని పార్టీ వర్గాలు అంటున్నారు. 2029లో తానే గెలిచి తీరుతాను అని అంబటి విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. వీటి సంగతి పక్కన పెడితే మరో మూడు సంక్రాంతులు డ్యాన్సులు అన్నట్లుగా అంబటి గుంటూరు వెస్ట్ పాలిటిక్స్ సాగనుందని చెబుతున్నారు.

# గ్రౌండ్ లెవెల్ రియాల్టీస్ : పవన్ అలెర్ట్ కావాల్సిందేనా ?



అమరావతి,పవన్ కళ్యాణ్ రాజకీయంగా గెలిచారు. 2014లో పార్టీ పెట్టి పోటీ చేయకుండా వ్యూహాత్మకంగా వ్యవహరించిన ఆయన 2019 నాటికి జనసేన బలం ఎంతో స్వయంగా తాను చూశారు. ఇక 2024 నాటికి స్ట్రాటజీ మార్చి పొత్తుల ఎత్తులతో కూటమిని కట్టి ఏకంగా ఉప ముఖ్యమంత్రి పదవిని అందుకున్నారు. ఆయనకు అయిదు ప్రధానమైన మంత్రిత్వ శాఖలు కూడా దక్కాయి. ఆయన కూడా తన శాఖల పనితీరులో రాటుతేలుతున్నారు. అవగాహన పెంచుకుంటున్నారు. ఇదంతా ఒకే కానీ పార్టీకి సంబంధించిన దాని మీద ఆయన ఏమి చేస్తున్నారు అన్నది చర్చగా ఉంది.

ఆశలతో ఎంతో మంది :

జనసేన మీద ఆశలతో ఎంతో ఆ పార్టీలో చేరారు. ఒక బలమైన సామాజిక వర్గం అయితే జనసేనతో అల్లుకుని పోయింది వారంతా పవన్ ని తమ ఆరాధ్య నేతగా భావిస్తూ పార్టీ కోసం పనిచేశారు. అయితే ఇపుడు వారిలో నిరాశ కనిపిస్తోంది అని అంటున్నారు. నామినేటెడ్ పదవులు అయినా దక్కుతాయని అనుకుంటే అవి కూడా అరకొరగా కొందరికీ లభించాయి. అదే విధంగా తమకు నియోజకవర్గాలలో అధికార పార్టీ నేతలుగా ప్రాముఖ్యత దక్కుతోందా అంటే అది కూడా పెద్దగా ఉండడం లేదని వాపోతున్నారు. దాంతో అనేక మంది అయితే పార్టీ నడుస్తున్న తీరు పట్ల కొంత బాధగా నిర్వేదంగా ఉన్నారని చెబుతున్నారు.

కలుసుకోవాలని ఉన్నా :

అధినేతను కలుసుకోవాలని తమ సాధక బాధకాలు చెప్పుకోవాలని చాలా మంది జనసేన నేతలు భావిస్తున్నారని అంటున్నారు. అయితే వారి విషయంలో అధినేత పెద్దగా స్పందించడం లేదని ఆయనను కలిసేందుకే వీలు కల్పించడం లేదని కూడా వారు మనో వేదన చెందుతున్నారు. తమ పార్టీ అధినేతతో తాము సమస్యలను చెప్పుకోకపోతే ఇక పార్టీలో ఉండి ఏమి లాభమని కూడా కొత్త ఆలోచనలు చేస్తున్నారు అని అంటున్నారు. వీరిలో కొందరు నేతలు అయితే ఇతర పార్టీలలో అవకాశాలను కూడా చూసుకుంటున్నారు అని ప్రచారం సాగుతోంది. ఈ మధ్యనే తాడేపల్లిలోని జగన్ సమక్షంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన కీలక నేతతో పాటు కొందరు వైసీపీలో చేరిన సంగతిని గుర్తు చేస్తున్నారు.

ఇది ప్రధాన అంశంగా :

ఇక కాపు కార్పొరేషన్ కి నిధులు విడుదల చేయకపోవడం మీద కూడా జనసేనలో నేతలు గుర్రు మీద ఉన్నారు తమ పార్టీ అధికారంలోకి వస్తే కాపు కార్పోరేషన్ కి దండీగా నిధులు వస్తాయని తమ సామాజిక వర్గం యువతకు ఆపన్నులకు అది ఎంతో మేలు చేస్తుందని భావించిన వారు ఏణ్ణర్థం గడచినా కూడా నిధులు విడుదల చేయకపోవడం మీద ఆగ్రహమే వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో పవన్ కలుగచేసుకోవాల్సి ఉందని అని వారు అంటున్నారు. ఇది ఇపుడు తీవ్రమైన ఇష్యూగా మారిపోతోంది. సోషల్ మీడియా వేదికగా కూడా అనేక మంది పోస్టుల మీద పోస్టులు పెడుతున్నారు. కూటమిలో తమకు న్యాయం జరిగిందా లేదా అని కూడా ప్రశ్నిస్తున్న వారూ ఉన్నారని అంటున్నారు.

అదే ముదిరితే ఇబ్బందే :

ఏ రాజకీయ పార్టీలో అయినా ముందుగా వచ్చేది అసంతృప్తి అది కాస్తా నెమ్మదిగా పెరిగి అసమ్మతిగా మారుతుంది. ఆ మీదట సెగలూ పొగలూ కక్కితే దానిని అదుపు చేయడం కష్టం. అందుకే ముందుగానే జాగ్రత్త పడాలని అంటున్నారు. జనసేన నేతలలో ఇంకా ఇప్పటికీ పవన్ కళ్యాణ్ మీద ప్రత్యేకమైన అభిమానం ఉందని చెబుతున్నారు. దాంతో అధినాయకత్వం అలెర్ట్ అయి సమస్యల మీద సమావేశాలు నిర్వహించి అందరినీ దగ్గరకు చేర్చుకుంటే తిరుగు ఉండదని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# జనవరి 24న తెలంగాణ మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్




హైదరాబాద్,తెలంగాణలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి కసరత్తు వేగవంతం చేసింది. అందులో భాగంగా రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ (ఎస్ఈసీ) రాణి కుముదిని.. జిల్లాలో కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఎస్ఈసీ ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలో కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా జనవరి 21, 22, 23 తేదీల్లో వివిధ జిల్లా కలెక్టర్లతో కూడా సమావేశాలు నిర్వహించి.. ఎన్నికల ఏర్పాట్లు, సన్నద్ధతపై చర్చించనున్నట్లు సమాచారం.కలెక్టర్లతో సమావేశాలు నిర్వహించి ఎన్నికల ఏర్పాట్లపై చర్చించిన తర్వాత.. మున్సిపల్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. అందులో భాగంగా జనవరి 24 లేదా జనవరి 27న తెలంగాణ మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే ఛాన్స్ ఉన్నట్లు సమాచారం. అయితే ఈ విషయంపై ప్రభుత్వం అధికారికంగా వివరాలు వెల్లడించలేదు.కాగా, ఇటీవల మేడారం సమ్మక్క- సారలమ్మ జాతరలో జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో మున్సిపల్ ఎన్నికలనిర్వహణకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఫిబ్రవరి నెలలో ఎన్నికలు జరపాలని నిర్ణయిస్తూ ఎన్నికల సంఘానికి ప్రభుత్వం లేఖ రాసింది. దీంతో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను ఎలక్షన్ కమిషన్ వేగవంతం చేసింది. ఇదిలా ఉండగా, 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు సంబంధించి మేయర్, చైర్‌పర్సన్ పదవుల రిజర్వేషన్లను ఖరారు చేసి.. మార్గదర్శకాలను కూడా విడుదల చేసింది.మున్సిపల్ ఎన్నికలను ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించేందుకు సర్కార్ సిద్ధమవుతోంది. అభ్యర్థుల అర్హతలు, నిబంధనలు, వ్యయ పరిమితులపై రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను విడుదల చేసింది. పారదర్శకతను పెంచేందుకు నిబంధనలను కఠినతరం చేసింది. మార్గదర్శకాల ప్రకారం.. కార్పొరేషన్ అభ్యర్థులకు రూ. 10 లక్షలు, గ్రేడ్ - 1 మున్సిపాలిటీలకు రూ. 5 లక్షల వరకు వ్యవ పరిమితిని విధించింది ఎన్నికల సంఘం. అందులో భాగంగా అభ్యర్థులు నామినేషన్ వేసే ముందే ప్రత్యేక బ్యాంకు అకౌంట్ ఓపెన్ చేయాలి. అందులో ఎన్నికల ప్రచారానికి ఉపయోగించే ఫ్లెక్సీలు, సోషల్ మీడియా ప్రకటనలు, భోజనాలు, వాహనాల ఖర్చులను ఈ ఖాతా ద్వారానే లెక్కించాలి.మున్సిపల్ ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న సమయంలో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఇప్పటికే కాంగ్రెస్ ఇంచార్జ్‌లన ప్రకటించింది. మరోవైపు బీఆర్ఎస్ కూడా సిద్ధమవుతోంది. అంతేకాకుండా జనసేన పార్టీ కూడా ఈ ఎన్నికల్లో పోటీ చేస్తామని ప్రకటించగా.. కవిత నేతృత్వంలోని తెలంగాణ జాగృతి నేతలు కూడా పోటీ చేస్తారని వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# రాజ్యసభలో పలు బిల్లులు పెండింగ్

న్యూఢిల్లీ, రాజ్యసభలో 19 ప్రభుత్వ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో 1992 నాటి జనాభా నియంత్రణకు సంబంధించిన బిల్లు కూడా ఉంది. రాజ్యసభ అనేది శాశ్వత సభ, ఇది ఎప్పటికీ రద్దు చేయబడదు. దాని సభ్యులలో మూడింట ఒక వంతు మంది ప్రతి రెండేళ్లకు పదవీ విరమణ చేస్తారు. లోక్‌సభ లో పెండింగ్‌లో ఉన్న బిల్లులు సభ రద్దయితే, అవి కూడా రద్దవుతాయి. రాజ్యసభలో పెం డింగ్‌లో ఉన్న బిల్లులు ఎప్పుడూ రద్దు కావు. రాజ్యసభ బులెటిన్ ప్రకారం.. ప్రస్తుతం 19 బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో పురాతనమైనది రాజ్యాంగ (79 సవరణ) బిల్లు-1992. జనాభా నియంత్రణ, చిన్న కుటుంబ నియమాన్ని ప్రభుత్వం ప్రోత్సహిం చాలని, ప్రాథమిక విధుల్లో చిన్న కుటుంబ నియమాన్ని ప్రోత్సహించడం, స్వీకరించడం చేర్చాలని ప్రభుత్వ విధాన నిర్దేశక సూత్రాలను సవరించాలని ఈ బిల్లు ప్రతిపాదించింది. ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలుంటే ఎంపి లేదా ఎమ్మెల్యేను అనర్హులుగా ప్రకటించాలని కూడా ఇది ప్రతిపాదించింది. పెండింగ్ బిల్లుల్లో ఢిల్లీ అద్దె (సవరణ) బిల్లు-1997 కూడా ఉంది. ఇది అ÷-దదె నియంత్రణ చట్టాలను ఆధునీకరించడానికి ఉద్దేశించిన ఢిల్లీ అ÷-దదె చట్టం-1995ను సవరించడానికి ఉద్దేశించబడింది. కానీ అద్దెదారులు, భూస్వామి సమూహాల నుండి గణనీయమైన వ్యతిరేకతను ఎదుర్కొంది. ప్రభుత్వం సీడ్ బిల్లు-2025 తీసుకు రావడానికి ప్రయత్నిస్తుండగా, పెండింగ్ బిల్లుల్లో సీడ్స్ బిల్లు-2004 ఉంది. ఇది అమ్మకం, దిగుమతి, ఎగుమతి కోసం విత్తనాల నాణ్యతను నియంత్రించడం, నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి, సరఫరాను సులభతరం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది.కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే కార్మికశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ప్రవేశపెట్టిన అంతర్రాష్ట్ర వలస కార్మికుల (ఉపాధి



నియంత్రణ, సేవా పరిస్థితుల) సవరణ బిల్లు-2011 కూడా పెండింగ్‌లో ఉంది.యుపిఎ-2లో ప్రవేశపెట్టిన ఇతర పెండింగ్ బిల్లుల్లో భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంబంధిత చట్టాలు (సవరణ) బిల్లు-2013, ఉపాధి మార్పిడి సవరణ బిల్లు-2013, పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాల్లో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల ప్రాతినిధ్య పునర్ వ్యవస్థీకరణ (మూడో) బిల్లు-2013 ఉన్నాయి.ఎన్డీఏ పాలనలో ప్రవేశపెట్టిన పెండింగ్ బిల్లుల్లో అస్సాం, మేఘాలయ, త్రిపుర, మిజోరాంలలో స్వయం ప్రతిపత్తి మండళ్ల ఆర్థిక, కార్యనిర్వాహక అధికారాలను పెంచడంతో ఈశాన్య ప్రాంతంలో గిరిజన స్వయం ప్రతిపత్తిని బలోపేతం చేయడానికి ఉద్దేశించిన బిల్లు. ప్రవాస భారతీయుల వివా హ నమోదు బిల్లు-2019 వంటి బిల్లులు ఉన్నాయి. తాజాగా ది పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్ బిల్లు-2020 పెండింగ్‌లో ఉంది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com